బయ్యక్కపేటలో పూజారులతో మాట్లాడుతున్న కలెక్టర్ త్రిపాఠి

సమ్మక్క దేవత గుడిని
పరిశుభ్రంగా ఉంచాలి

బయ్యక్కపేటలో పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

తాడ్వాయి, జనవరి 1: మేడారం వనదేవత సమ్మక్క పుట్టిన గ్రామమైన మండలంలోని బయ్యక్కపేటలో దేవత గుడి ఆవరణతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గ్రామంలోని సమ్మక్క దేవత గుడిని సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. గుడి పరిసరాలు, జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం మేడారంలో జరుగుతున్న శానిటేషన్ స్టోర్ భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అక్కడి నుంచి ఐటీడీఏ క్యాంపు కార్యాలయానికి చేరుకున్న కలెక్టర్ పార్కింగ్ స్థలాలకు సంబంధించిన ఇంజినీరింగ్, దేవాదాయశాఖ, ఈజీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీఐపీ పార్కింగ్ నుంచి వీవీఐపీ పార్కింగ్ స్థలాల వరకు కొనసాగుతున్న మరమ్మతులు, పార్కింగ్ ప్రదేశాల్లో కల్వర్టుల పనులు, పొదల తొలగింపు, దెబ్బతిన్న రోడ్ల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, మేడారం జాతర కార్యనిర్వాహక అధికారి రాజేంద్రంతోపాటు ఇంజినీరింగ్ శాఖల అధికారులు తదితరులున్నారు.

బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత
పెంపునకు కృషి చేయాలి

- **జనవరి ఉత్పాదకత లక్ష్యం 4.77 లక్షల టన్నులు**
- **భూపాలపల్లి ఏరియా జీఎం శ్రీనివాసరావు**

మాట్లాడుతున్న జీఎం

భూపాలపల్లి రూరల్, జనవరి 1 : భూపాలపల్లి ఏరియాలో ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచేందుకు ఉద్యోగులందరూ సమష్టిగా కృషి చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం భూపాలపల్లి జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉత్పత్తి, ఉత్పాదకతపై నెలవారీ సమీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డిసెంబర్‌లో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యం 4.86 లక్షల టన్నులకు 3.49 లక్షల టన్నులు సాధించినట్లు తెలిపారు. 72శాతం బొగ్గును రవాణా చేశామని పేర్కొన్నారు. జనవరిలో 4.77 లక్షల టన్నులు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. గైర్హాజరు శాతాన్ని తగ్గించి ఉత్పత్తి పెంచేలా కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. కార్మికులు, అధికారులు తప్పనిసరిగా వర్కింగ్ పర్మిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని, రక్షణ విషయంలో రాజీ పడేది లేదన్నారు. కారుణ్య నియామకాలను వెంటనే ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, ఉద్యోగ విరమణ పొందే ఉద్యోగులు పొందే స్కీములను వెంటనే అందించేందుకు కృషి చేస్తానని, డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తానని జీఎం తెలిపారు. ఏజీఎం జ్యోతి, అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం, డీవైపీఎం శ్యాంప్రసాద్, అకౌంట్ ఆఫీసర్ గణేశ్ పాల్గొన్నారు.

పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్

వాజేడు, జనవరి 1: మండలంలోని మొరుమురు గ్రామ పంచాయతీలోని బొల్లారంలో సోమవారం సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి ఎస్సై చావాళ్ల వెంకటేశ్వరరావు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామంలోకి ఎవరైనా అపరిచితులు వస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వారికి ఎలాంటి ఆశ్రయం ఇవ్వొద్దని సూచించారు. ఏదైనా సమస్య వస్తే నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని ఎస్సై తెలిపారు.

కోటి ఆశలతో.. కొత్త ఏడాదిలోకి

- **ప్రశాంతంగా డిసెంబర్ 31 వేడుకలు**
- **ఎక్కడికక్కడ కట్టడి చేసిన పోలీసులు**
- **జిల్లాలో 26 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు**

భూపాలపల్లిలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న మహిళలు

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 1 (నమస్తే తెలంగాణ): ప్రజలు 2023 సంవత్సరానికి ఘనంగా వీడ్కోలు పలికారు. 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వేడుకలు అంబరాన్నంటేలా జరుపుకున్నారు. గత ఏడాది మంచీ చెడులను గుర్తుచేసుకుంటూ, కొత్త ఏడాదిలోకి కోటి ఆశలతో అడుగు పెట్టారు. ఈక్రమంలో డిసెంబర్ 31 వేడుకలను జిల్లాలో ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఎస్పీ కిరణ్ ప్రభాకర్ ఖరే జిల్లాలోని పోలీసులను అప్రమత్తం చేశారు. మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాలు, గొడవలు జరిగే అవకాశాలుండడంతో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు పోలీసులు ఆదివారం రాత్రి 7గంటల నుంచే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు ముమ్మరం చేశారు. దీంతో మద్యంప్రియులు రోడ్డెక్కే సాహసం చేయలేదు. ఇండ్లలో, ప్రత్యేక ప్రదేశాల్లో వేడుకలు జరుపుకొన్నారు. భూపాలపల్లిలో డీఎస్పీ రాములు ఆధ్వర్యంలో సీఐ రాంనర్సింహారెడ్డితో పాటు ఎస్సైలు ప్రశాంత్, సంధ్యారాణి, చిట్యాల ఎస్సై షాఖాన్ ప్రధాన కూడళ్లలో రాత్రి 7గంటల నుంచి అర్ధరాత్రి వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేశారు. భూపాలపల్లిలో 12, కాటారంలో 14 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. దీంతో వేడుకలు ప్రశాంతంగా పూర్తయ్యాయి. మద్యం తాగి పట్టుబడితే రూ.10వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష అంటూ పోలీసులు ముందస్తుగా నిర్వహించిన ప్రచారం సైతం సత్ఫలితాలనిచ్చింది. ఏటా డిసెంబర్ 31న జిల్లా కేంద్రంలో గొడవలు, రోడ్డు ప్రమాదాలు జరుగడం పరిపాటిగా మారగా, ఈసారి పోలీసుల చర్యలతో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోలేదు.


ఏటూరునాగారం: చర్చిలో క్యాలండర్ ఆవిష్కరిస్తున్న వలియాబీ

భూపాలపల్లి పట్టణంలోని ఎల్‌బీనగర్‌లో న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ఆంగ్ల సంవత్సరాది వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల ప్రజలు పాత 2023 సంవత్సరానికి వీడ్కోలు, నూతన సంవత్సరం 2024కు స్వాగతం పలికారు. మహిళలు, యువతులు ఉదయాన్నే ఇండ్ల వాకిళ్లలో ముగ్గులు వేశారు. యువకులు కేక్‌లు కట్ చేశారు. సోషల్ మీడియాలో శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. ఏటూరునాగారం మండలం ఆకులవారి ఘనపూర్‌లోని జీసస్ సేవ్స్ మినిస్ట్రీస్ చర్చిలో జరిగిన వేడుకల్లో జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ పాల్గొని, కేక్ కట్ చేసి క్యాలెండర్ ఆవిష్కరించారు. సీపీఎం నాయకుడు దావూద్, చర్చి పెద్దలు రాకేశ్ ఫిలిమ్స్ పాల్గొన్నారు. కాగా, చిన్నబోయిన పల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న దేవరాయ రమేశ్ రావి ఆకుపై 2024 హ్యాపీ న్యూయర్ అంటూ చిత్రీకరించాడు. టేకుమట్లలో అర్ధరాత్రి వరకు ఎస్సై గట్ల సుధాకర్ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహించారు. మల్హార్ మండలం కొయ్యూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నరేశ్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు.

పోలీస్ కార్యాలయాల్లో..

ములుగు రూరల్/కాటారం : పోలీస్ కార్యాలయాల్లో న్యూ ఇయర్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ములుగు సీఐ కార్యాలయంలో సీఐ మేకల రంజిత్‌కుమార్, ఎస్సైలు వెంకటేశ్వర్, రామకృష్ణను దళిత సంఘాల నాయకులు కలిసి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. సీఐతో కేక్ కట్ చేయించారు. దళిత సంఘాల నాయకులు జన్ను రవి, నద్దునూరి రమేశ్, బోడ రఘు, ఓరుగంటి అనిల్, కోయిల రాంబాబు, గుగ్గిళ్ల సృజన్, బోడ సతీష్, మాదారపు రాజు, దార మధు ఉన్నారు. కాటారం పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రంజిత్ రావు, మహదేవపూర్ సీఐ కిరణ్‌కుమార్, ఎస్సైలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సైలు అభినవ్, నరేశ్, లక్ష్మణ్‌రావు, రాజ్‌కుమార్, ప్రసాద్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుగుణ, సమ్మిరెడ్డి, మహేశ్వరి, విజయారెడ్డి, రఘురాం, శ్రీహరి, తిరుపతిరెడ్డి, కిరణ్, గౌరక్క, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణకాలనీ: భూపాలపల్లిలో ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న యువతులు

ములుగు రూరల్ : కేక్ కట్ చేస్తున్న ములుగు సీఐ రంజిత్‌కుమార్

కాటారం: కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కేటీఆర్‌కు వాసుదేవరెడ్డి శుభాకాంక్షలు


కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కేతిరెడ్డి వాసుదేవరెడ్డి

కృష్ణకాలనీ, జనవరి 1: హైదరాబాద్‌లో బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌ను పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డి సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కనులపండువగా మల్లన్న బోనాలు

మహదేవపూర్, జనవరి 1: మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం మల్లన్న (జాడి) బోనాల జాతర కనులపండువగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో స్వామివారికి బోనం సమర్పించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మల్లన్నను దర్శించుకొని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించారు. ఎంపీపీ బన్సోడ రాణీబాయి, జడ్పీటీసీ గుడాల అరుణా శ్రీనివాస్, సర్పంచ్ శ్రీపతిబాపు, పీఏసీఎస్ చైర్మన్ సల్ల తిరుపతిరెడ్డి, జాడి శ్రీశైలం పాల్గొన్నారు.

కాటారంలో పుట్ట మల్లన్నకు..

కాటారం : మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌పల్లిలో సోమవారం పుట్ట మల్లన్న బోనాల జాతర ఘనంగా జరిగింది. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి పుట్ట మల్లన్నకు పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఆవరణలో బోనాలు వండి నెత్తిపై పెట్టుకొని ప్రదక్షిణలు చేసి మల్లన్న దేవుడికి సమర్పించారు. లక్ష్మీ దేవరల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో తూగిపోయారు. ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టీఎంసీఈ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వినోద్

ములుగు రూరల్, జనవరి 1: తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ములుగు ప్రభుత్వ దవాఖానలో పని చేస్తున్న పెద్దకాసు వినోద్‌కుమార్ ఎంపికయ్యారు. ఈనెల 29న జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో జిల్లా నుంచి తాను ఎంపికైనట్లు ఆయన తెలిపారు. మెడికల్ సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ విభాగాల్లో వేతనాలను పెంచేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు.

పండ్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ బృందం

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

మంగపేట, జనవరి 1: శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగరమేశ్ బర్త్ డే సందర్భంగా మండల కేంద్రంలోని కస్తూర్బా వృద్ధాశ్రమంలో సోమవారం పండ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు రాజుపేటలో అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు, శ్రీనాగుల మ్మ గుడి చైర్మన్ బాడిశ రామకృష్ణస్వామి, రైతు సేవా సహకార సం ఘం చైర్మన్ తోట రమేశ్, కమలాపురం డైరెక్టర్ సిద్దంశెట్టి లక్ష్మణ్‌రావు, కస్తూర్బా వృద్ధాశ్రమ నిర్వాహకురాలు సామ్రాజ్యం, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు రాజమల్ల సుకుమార్, కొమరం ధనలక్ష్మి, మలికంటి శంకర్, సాంబశివరావు, బాడిశ నవీన్, నిమ్మగడ్డ ప్రవీణ్, బోడ శ్రీను పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న బ్లడ్ డోనర్స్ నిర్వాహకులు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఏటూరునాగారం, జనవరి 1 : బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో దాతల నుంచి విరాళాలుగా సేకరించిన రూ.56వేలను మండల కేంద్రానికి చెందిన మల్యాల అనిల్ కుటుంబానికి సోమవారం అందజేశారు. ఐదు రోజుల క్రితం మల్లంపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అనిల్ మృతిచెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో బ్లడ్ డోనర్స్ సోషల్ మీడియా ద్వారా విరాళాలను సేకరించారు. రూ.56 వేలు సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. బ్లడ్ డోనర్స్ నిర్వాహకులు వహీద్, సభ్యులు మెరుగు హరీశ్, విజయ భాస్కర్, కొయ్యల సతీశ్, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు చిటమట రఘు, సులేమాన్, వీసం నర్సయ్య, కూనూరు మహేశ్, ఖాజాపాషా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అప్జల్‌పాషా, అజ్మత్ అలీ, ఫరూక్, సర్వ సాయి, మెరగు రఘు, పాషా, చామర్తి కిషోర్, గోపాల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గేదెను ఢీకొట్టి ఒకరి మృతి

వినోద్‌రెడ్డి (ఫైల్)

గోవిందరావుపేట, జనవరి 1 : గేదెను ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని పస్రా గ్రామంలో జరిగింది. ఎస్సై మస్తాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పస్రాకు చెందిన వాసంపల్లి వినోద్‌రెడ్డి(31) బైక్‌పై పస్రా నుంచి మొద్దులగూడేనికి ఆదివారం రాత్రి వెళ్లాడు. తిరిగి 9.30 గంటలకు పస్రాకు వస్తుండగా రహదారిపైకి గేదె హఠాత్తుగా రావడంతో ఢీకొట్టాడు. దీంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

అమ్మబడును

★సుబేదారి నందు గల గర్ల్స్ హాస్టల్ ఫర్నిచర్‌తోని అమ్మబడును. హాస్టల్లో ఉండి వంట చేయుటకు వంట మనిషి కావలెను. (లేడీస్). సంప్ర: 8328620934.
NTW-321540

CHANGE OF NAME

★I, PENDEM SAVITRI, R/o. H.No: 4-77, LICCLY, VIDYARANYAPURI, WARANGAL- 506009, T.S CHANGED MY NAME AS PONNALA SAVITHRI W/o. POLLALA SHYAMSUNDER
NT-319311

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

కాళేశ్వరంలో భక్తుల సందడి

- **కొత్త సంవత్సరం నేపథ్యంలో దర్శించుకున్న ప్రజలు**


కాళేశ్వరం : అభిషేక పూజలు చేస్తున్న భక్తులు

కాళేశ్వరం, జనవరి 1: న్యూ ఇయర్ ప్రారంభం సందర్భంగా సోమవారం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ముందుగా భక్తులు ఆలయ త్రివేణి సంగమం గోదావరి తీరంలో స్నానాలు చేసి నదీమాతకు దీపాలు వదిలారు. అక్కడి నుంచి ఆలయానికి చేరుకొని కాళేశ్వర ముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్వతి, మహా సరస్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు.

రామప్పలో..

వెంకటాపూర్ : మండలంలోని రామప్ప ఆలయం శనివారం న్యూ ఇయర్ సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. విదేశీయులు, పలువురు అధికారులు సందర్శించగా అర్చకులు భక్తులకు పూజల తర్వాత తీర్థ ప్రసాదాలందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించారు. రామప్ప సరస్సులో బోటింగ్ చేశారు. సుమారు 20వేల మంది పర్యాటకులు సందర్శించి పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాపురం (నూగూరు), జనవరి 1 : మండలంలోని ఒంటిమామిడి గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. చొక్కాల గ్రామానికి చెందిన లక్ష్మీనర్సు టీవీఎస్ ఎక్సెల్‌పై వెంకటాపురం నుంచి వాజేడు మండలం వైపు వెళ్తున్నాడు. వెంకటాపురం మండలం చెరుకూరుకు చెందిన శ్యామ్ వాజేడు మండలం నుంచి బైక్‌పై వెంకటాపురం మండల కేంద్రానికి వస్తున్నాడు. ఒంటిమామిడి గ్రామ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో చికిత్స నిమిత్తం వెంకటాపురం వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో భద్రాచలం వైద్యశాలకు తరలించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కాటారం, జనవరి 1: మండలంలోని రేగులగూడెం జీపీలోని దేవరాంపల్లికి చెందిన కుసుమ నరేశ్(28) ఆదివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకునాడు. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం నరేశ్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఫోన్ రావడంతో బయటకు వెళ్లి తిరిగి రా లేదు. కాగా అతడు ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వీడియో తీసి వాట్సాప్ స్టేటస్ పెట్టాడని కొందరు కుటుంబసభ్యులకు సమాచారమివ్వగా, వారు గాలింపు చేపట్టి ధన్వాడ ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నట్లు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో జీపీ కార్యదర్శి మృతి

చిల్పూరు, జనవరి 1 : జనగామ జిల్లా చిల్పూరు మండలం కొండాపూర్‌కు చెందిన పంచాయతీ కార్యదర్శి కొల్లూరి రాజు(31) గుండెపోటుతో మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. లింగాలఘనపురం మండలం కళ్లెం గ్రామానికి చెందిన రాజు కొండాపూర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం ఉదయం ఇంటి వద్ద రాజుకు గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి

- **ఐటీడీఏ పీవో అంకిత్**

ఏటూరునాగారం, జనవరి 1: అధికారులు ప్రైవేట్ కంపెనీలతో సమన్వయం చేసుకుని గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళాలు నిర్వహించాలని ఐటీడీఏ పీవో అంకిత్ కోరారు. సోమవారం ఐటీడీఏ కాన్ఫరెన్స్ హాలులో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేయగా, వివిధ శాఖల అధికారులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు తినిపించారు. పీవో మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి గ్రామాల్లో ఎంసీహెచ్ బృందాలతో సమన్వయం చేసుకుని వైద్య శిబిరాలు నిర్వహించాలని నేషనల్ హెల్త్ మిషన్ అధికారులను ఆదేశించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు వివిధ కంపెనీలతో ఇంటరాక్ట్ కావాలని అధికారులకు సూచించారు. ఏపీవో వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, ఆర్‌సీవో అగస్టీన్, అక్కౌంట్స్ మేనేజర్ నర్సింగ్, జేడీఎం కొండల్‌రావు, ఎన్‌హెచ్ఎం ప్రాజెక్టు మేనేజర్ మహేందర్ పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న పీవో అంకిత్, ఇతర అధికారులు

శ్రీరాముడి అక్షింతలకు ప్రత్యేక పూజలు

చిట్యాల/వాజేడు, జనవరి 1: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతల ఊరేగింపు సోమవారం పలు గ్రామాల్లో కొనసాగింది. చిట్యాల మండలం ఏలేటిరామయ్యపల్లిలో మేళతాళాల నడుమ అక్షింతలను ఊరేగించి హనుమాన్ ఆలయం వద్ద పూజలు చేశారు. అభయాంజనేయ స్వామి వద్ద భక్తులు, గ్రామస్తులకు మహా అన్నదానం చేశారు. కనుకుల లక్షారెడ్డి, రాంరెడ్డి, మహిపాల్‌రెడ్డి, కంచు కుమార్, బుర్రి తిరుపతి యాదవ్, ఉమ్మనవేన రాజేశ్, మర్రి రాజు, పెద్దిరెడ్డి రాజు పాల్గొన్నారు. వాజేడు మండలం చీకుపల్లిలోని రామాలయానికి అయోధ్య రామమందిరం అక్షింతలను గ్రామస్తులు ఊరేగించారు. అనంతరం అక్షింతలను ఇంటింటికీ అందజేసి, ఆలయంలో పూజలు నిర్వహించి భజనలు చేశారు.


చిట్యాల: అక్షింతలకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు